


# అమ్మమ్మగారిల్లు

## కథాపరిచయం

మొక్కలాంటి బాల్యానికి పెద్దల వాత్సల్యమనే మర్రినీడ ఎంత అవసరమో ఈ కథ చెబుతుంది.

విలాసాలు, ఖరీదైన వినోదాలూ లేని సామాన్య జీవితంలో కూడా మంచి కాలక్షేపాన్ని వెదుక్కుని తృప్తిని అనుభవించవచ్చని పల్లె జీవితం చాటుతుంది.

ఆత్మీయులు శాశ్వతంగా కనుమరుగు కావటం పిల్లల్ని ఎలా ప్రభావితం చేస్తుంది, మరణమనే బాధాకరమైన జీవిత సత్యాన్ని పిల్లలు ఆకళింపు చేసుకోవటానికి అనుగుణంగా పెద్దలు ఎలా వ్యవహరిస్తారు అనేది కూడా ఈ కథలో చెప్పే ప్రయత్నం జరిగింది.

వేసవికాలం సెలవులు.

మార్చి నెల సెలవలివ్వగానే అమ్మమ్మా వాళ్ల ఊరు వెళ్లటం కొన్నేళ్లుగా నాకు అలవాటు. సెలవులకి అమ్మమ్మనీ తాతయ్యనీ చూసి తీరాల్సిందే. "ముసలి వాళ్లం. ఎక్కడికీ రాం. మమ్మల్ని చూడటానికి మీరంతా వస్తూ ఉండండి. ఏదో మా ఘటాలిట్లా వెళ్లిపోవాల్సిందే మా ఊళ్లో" అంటారిద్దరూ.

మా అమ్మకి ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లెలూనూ. మామయ్యలిద్దరూ కేరాఫ్ అమెరికా. పిన్ని జయపూర్‌లో సెటిలయింది. మా నాన్నకు, అమ్మకూ హైదరాబాద్‌లో ఉద్యోగం. నేను ఒక్కడినే కాబట్టి అమ్మానాన్నా ఉద్యోగస్తులు కాబట్టీ, అమ్మమ్మ ఊరికి దగ్గరలో ఉండేది మేమే కాబట్టీ ఇలా ఎన్నో కాబట్టీల కారణంగా నేను తప్పనిసరిగా ప్రతీ సెలవులకీ రెండు నెలలు అక్కడ మకాం వేసేవాడిని.

ఆ ఊరంటే నాకు ప్రాణం. సిటీల్లో అపార్ట్‌మెంట్లలో ఉండేవాళ్లకి అక్కడికి వెళ్తే జైలు నుండి విడుదలైనట్లుంటుంది. మా తాతయ్యకి అక్కడ పొలాలూ, కొబ్బరి తోటలూ ఉన్నాయి. అమ్మమ్మ తాతయ్యా ఇద్దరిదీ మంచి ఆరోగ్యం అవటం వల్ల పనులన్నీ స్వయంగా చక్కబెట్టుకుంటూ ఉండేవారు. వాళ్ల ఇల్లు పాతకాలం నాటిది. చాలా పెద్దగా, ఎత్తయిన గోడలతో, బరువైన చెక్కతలుపులతో విశాలంగా ఉండేది. ఆ ఇంటికి గేటు లేదు. ముందంతా బోలెడన్ని పూలచెట్లు, పందిరిగుంజలూ, ఎన్నో రకాల కూరగాయల మడులూ ఉండేవి. ఒక పక్కగా గిలకబావి, ఇంటివెనుక పెద్ద పెరడు. నాలుగైదు పెద్ద మామిడిచెట్లు, నేరేడు, జామ, సీతాఫలం, దబ్బ చెట్లు, ఒక చింతచెట్టూ ఉండేవి.

ఇంటికి బాగా వెనుకగా గొడ్లకొట్టం, ఒక చిన్న పెంకుటిల్లు అందులో పాలేరు గంగాయి కటుంబం కాపురముండేది.

ఇల్లూ వాకిలీ చిమ్మి, నీళ్లు చల్లి ముగ్గులేయటం, కూరగాయలూ మొదలైనవి వంటకు సరిపడా కోసిపెట్టడం, పెరట్లో ఉన్న పెద్దరోలు శుభ్రంగా కడిగి, పీట వాల్చి సిద్ధం చేయటం... ఒకటేమిటి... ఈ చిన్నాపొన్నా పనులు తెల్లవారిన దగ్గర్నుంచి గంగాయి భార్యాపిల్లలు చకచకా చేస్తూ పోయేవారు.

గంగాయి గొడ్ల పనీ, పొలం పనులూ చక్కబెట్టుకొచ్చేవాడు. తాతయ్య ఎక్కడకి వెళ్లినా నీడలాగా వెన్నంటి ఉండేవాడు.

అమ్మమ్మ తెల్లవారక ముందే లేచి వంటిల్లూ, పూజగదీ కడిగి, స్నానం చేసేది. ఎవరు ఎన్ని చీరలిచ్చినా అవి 'పిల్లలకు ఉండనీ' అని దాచిపెట్టి రెండో మూడో నేత చీరలు ఏడు గజాలవి కాశెపోసి (కచ్చాపోసి) కట్టుకునేది. ఒకటి చిలకాకుపచ్చ, రెండవది నెమలిపింఛం రంగు... ఆ రెండు కలనేత చీరలు మాత్రమే కట్టుకునేది. కాలివేళ్లకి పెద్దపెద్ద మెట్టెలు, చేతుల నిండా ఎరుపు, ఆకుపచ్చ గాజులు.. ముక్కుకి ముక్కెర, తెల్లరాళ్ల కుచ్చు ముక్కుపుడక, చెవులకి పెద్ద పెద్ద తెల్లరాళ్ల కమ్మలు.. మెళ్లో నాను, పలకసర్లు.. పెద్ద ఎర్రటి కుంకం బొట్టు, తెల్లటి వెండి జుట్టు, పొడుగూ పొట్టీ కాకుండా ఉండి ఆరోగ్యంగా, వత్తసరిగా ఉండేది.

తాతయ్య బాగా పొడుగు, గుండూ, పిలకాను. విభూతి, కుంకం ఎప్పుడూ ముఖాన ఉండాల్సిందే. మెళ్లో రుద్రాక్షలు. పాపం నాలుగైదు పళ్లు ఊడిపోయినాయి.

వంటిల్లు, పూజగదీ దరిదాపుల పనులన్నీ అమ్మమ్మే స్వయంగా చూసుకునేది. గంగాయి పిండి తెచ్చిన పాల తప్పేలా కుంపటి మీదికెక్కించి మజ్జిగ చిలికి వెన్న తీసేది. తాతయ్య పొద్దున్నే చుట్ట కాల్చుకుంటూ కూచుంటే మజ్జిగ చేస్తూ 'ఆడిపోసుకునేది' ఇలా అని తాతయ్యే అనేవాడు. "ఎందుకే అలా ఆడిపోసుకుంటావ్?" అని.

వంట మొదలుపెట్టి రోటి దగ్గర కూచుని పచ్చడి నూరేది. నన్ను పిలిచేది. అరచేతిలో పచ్చడి ఉంచి "ఉప్పు చూడరా సరిపోయిందో లేదో" అనేది.

అమ్మమ్మ ఇంట్లో బ్రేక్‌ఫాస్టు ఉండదు. పెద్ద గ్లాసుడు పాలు పంచదార వేసి తాతయ్య చేతికిస్తే ఆయన మరీ వేడి లేకుండా చల్లారపోసి నాకు ఇచ్చేవాడు. బూస్టో, హార్లిక్సో తాగే నాకు ఆ మాట కూడా గుర్తురానంత రుచిగా ఉండేవి ఆ పాలు. తాతయ్య స్నానం చేసి మడి కట్టుకుని సంధ్యవార్చుకున్నాక, పదకొండింటికి ఏకంగా భోజనం వడ్డించేది. వంటింట్లో పెద్దపీట మీద తాతయ్య, చిన్నపీట మీద నేను, అమ్మమ్మ విసనకర్ర పెట్టి విసురుతుంటే వేడన్నం తినేవాళ్లం.

ఏ రకమైన పొడులూ, మసాలాలూ ఉండేవి కావు. అమ్మమ్మ వంటలో ఉప్పు, కారం, చింతపండు, తిరగమోత డబ్బా వీటితోనే ఎన్నో వంటలు చేసేది. ఎక్కువగా, నూనె, నెయ్యి కూడా వాడేది కాదు.


తాతయ్య నాకు మొక్కలకు కలుపు తియ్యటం, మళ్లకు నీళ్లు పట్టటం నేర్పాడు. ఆకుకూరలు ఎంత బలవర్థకాలో, వాటన్నిటి పేర్లు, ఎలా వాటిని గుర్తించాలో వివరించాడు.

అమ్మమ్మ తోటకూర, పొన్నగంటికూర వంటివి పచ్చిమిరపకాయ తిరగమోత వేసి పొడికూరగానూ, పాలకూర, బచ్చలి, గోంగూర, చుక్కకూర వంటివి పులుసు కూరగానూ వండేది.

కూరలపాదులు.. కాకర, బీర, బెండ వంటి వాటి పెంపకం ఎంత సులువో చూపించి చెప్పేవాడు తాతయ్య.

అమ్మమ్మ వంట కూడా పూటకి సరిపడా, పనివాళ్లకు కాస్త పెట్టతగినంత మాత్రమే చేసేది. రాత్రికి ఏవీ మిగిలేవి కావు కాబట్టి చారూ, కందీ, పెసరా వంటి పచ్చళ్లూ, కవ్వం తిప్పిన మజ్జిగ చేసేది. చారు సువాసన ఆరుబయటికి కూడా వచ్చేది.

బెండకాయ, బీర, పొట్ల వంటివి ముద్ద కూరగా వండేది. ముద్దపప్పుతో పాటుగా సొరకాయ లేదా బూడిదగుమ్మడి, మునక్కాడలు వేసి పులుసుగానీ, మజ్జిగ పులుసు గానీ పెట్టేది. గుమ్మడి వడియాలు, పేలాలవి, కొత్తిమీర వడియాలు, చల్లమిరపకాయలు వేయించేది.



అప్పుడప్పుడు చింతకాయ, ఉసిరికాయ, దోసకాయ రోటి పచ్చళ్లు చేసేది. తాజాగా తీసిన వెన్న నాకు అన్నంలో వేసేది. నాకు సరిగా కలుపుకొని తినటం రాదని ఇద్దరూ అనుకునేవాళ్లు. అందుకే అమ్మమ్మ ఒక్కొక్కటి తనే కలిపి తినమనేది. తను కలిపినంతా తినాల్సిందే.

ఇంట్లో రోజూ డైనింగ్ టేబిల్ దగ్గర నానా గోల చేసి అమ్మవంటకు పేర్లు పెట్టే నాకు అమ్మమ్మ వంట ఎంత ఇష్టమో చెప్పలేను. “పాపం బంగాళా దుంపలు ఎర్రగా వేయించి పెట్టవే బిడ్డకి” అని తాతయ్య అడిగితే-

“ఏమక్కర్లేదు. వాళ్ల ఊళ్లో రోజూ తినేవి అవేగా. నాలుగు రకాల కూరలూ తినడం నేర్చుకోవాలి. లేకపోతే అవొద్దు, ఇవొద్దు అని షోకులు పోతారు రేపు పెద్దయ్యాక” అని కొట్టి పారేసేది.

లేత కాకరకాయలు మధ్యలో గాటుపెట్టి ఉప్పూ కారంతో పాటు పంచదార కలిపి, అందులో కూరి దోరగా వేయించి తినిపించేది. “తీపి, పులుపు, కారం లాగా చేదు కూడా ఒక రుచే. అది తినడం కూడా అలవాటు చేసుకో. ఒంటికి ఎంతో మంచిది” అని నచ్చచెప్పేది.

నేను ఇష్టం లేనట్లు ముఖం చిట్లిస్తే కాకరకాయ కూర కలిపిన అన్నం ముద్దలు నోట్లో పెట్టేది. రెండు ముద్దలు తిన్న తరువాత ఆ రుచి కూడా ‘సూపర్’ అనిపించేది. కొన్నిసార్లు సాయంత్రం మినపపిండితో పునుగులు, పులిబొంగరాలు చేసేది. అరిశెలు, వేరుశెనగపాకం, కొబ్బరిలౌజు లాంటివి చేసి డబ్బాకి ఎత్తిపెట్టేది సాయంత్రం తోచక ఆకలి అంటానని.

వేసవి సాయంత్రాలు బావి దగ్గర చేసే ‘ఓపెన్ బాత్’ నేను చాలా ఎంజాయ్ చేసే ఘట్టాలలో ఒకటి. గంగాయి బిందెలతో తోడి నా మీద పోసేవాడు. నేను అల్లరిగా గెంతుతూంటే గంగాయి పిల్లలు చప్పట్లు కొట్టి ఎగిరేవాళ్లు. తాతయ్య, అమ్మమ్మ, కళ్లల్లో తమ పిల్లలు చిన్నతనాలు కదిలేవి కాబోలు. అలాగే గుడ్లప్పగించి నన్ను చూస్తూ ఉండేవాళ్లు.

మా ఇంట్లో టీవీ ముందు, గంటలు, గంటలు కూచుని లేవని నేను తాతయ్య చెప్పే కాశీ మజిలీ కథలు, చందమామ కథలు ఆసక్తిగా వినే వాణ్ని.

అమ్మమ్మ దగ్గర పెద్ద బాలశిక్ష ఉండేది. అది మా అమ్మావాళ్ల చిన్ననాటిదట. రాత్రి పడుకున్న తరువాత నా చేత ‘అశ్వని, భరణి’ అంటూ నక్షత్రాల ఇరవై ఏడు పేర్లు, ‘ప్రభవ, విభవ’ అంటూ తెలుగు సంవత్సరాల పేర్లు నా కళ్లు మూతలు పడేదాకా వల్లెవేయించేది.

అలా నాకు తెలీకుండానే నేను మా అమ్మమ్మ బళ్లో సుమతీశతకం, వేమన పద్యాలు, సామెతలు, దిక్కులు..

ఇలా లెక్కలేనన్ని విషయాలు నేర్చుకుంటూ వచ్చాను ప్రతి ట్రిప్పులోనూ. అమ్మమ్మకు చదవడమూ, రాయడమూ కూడా వచ్చు.

మధ్యాహ్నాలు ఇంటి పని ముగిసిన తరువాత సామాన్ల కొట్టిడి దగ్గర గంగాయి భార్యను కూచోపెట్టుకుని ఆవాల దగ్గర్నుంచీ బియ్యం దాకా చాటలో పోసుకొని శుభ్రంగా ఏరేది. చింతపండు గింజలు వలిచి, ఈనెలు తీసేది.

తాతయ్య, అమ్మమ్మ నేను పోటీలు పడి పత్తి విడిపించి దీపారాధనకి వత్తులు చేసేవాళ్లం. పువ్వొత్తులు, పొడవాటివి చాలా చక్కగా, ఒక్కొక్కటీ శ్రద్ధగా వత్తిని మెలితిప్పుతూ చేసేది. కార్తీకమాసం కోసం మూడొందల అరవై వత్తుల కట్టలు చేసేవాళ్లం. ఎవరెక్కువ చేస్తారనే పోటీ నాకూ తాతయ్యకీ మధ్య ఎక్కువగా వుండేది.

వత్తులు చేసినంతసేపూ భగవంతుణ్ణి ధ్యానించాలని అమ్మమ్మ చెప్పేది. తాతయ్యకి కబుర్లంటే ప్రాణం.

"అబ్బబ్బ...అలా వసపిట్టలాగా వాగుతూ చెయ్యకపోతే రామనామం చేసుకోరాదూ.. ఇహానికి ఇహము, పరానికి పరం" అని తాతయ్యను కసిరేది.

"ఆ.. నువ్వు చేస్తున్నావు చాల్లే పెద్ద బడాయి" పిల్లవాడి ముందు కసిరిందని అలిగి చురక అంటించేవాడు తాతయ్య.

అన్నట్టు.. అప్పడాల పిండి కలిపినప్పుడు వట్టిదే తినేవాళ్లం.

అన్నంలో నెయ్యివేసి కలుపుకుని తినేవాళ్లం. అదొక ప్రత్యేకమైన రుచి.

అన్నింటికంటే విశేషంగా చెప్పాల్సింది అమ్మమ్మ ఆవకాయ గురించి.

ఆవకాయల రోజుల్లోస్తే అమ్మమ్మ చెప్పలేనంత బిజీ! గంగాయిని పెరట్లో చెట్లెక్కించి కాయలు కోయించేవాడు తాతయ్య.

గంగాయి పిల్లలతోపాటు నేనూ వాటిని బావి దగ్గర తొట్లో కడిగేవాణ్ణి. అమ్మమ్మ శుభ్రమైన తెల్లటి తుండుగుడ్డ ఇస్తే తాతయ్య నేను అది పెట్టి మామిడికాయల్ని తడిలేకుండా తుడిచేవాళ్లం.

అమ్మమ్మ దగ్గరుండి గంగాయి చేత కాయల్ని 'అరుపచ్చాలు'గా పెద్ద కత్తిపీటతో ముక్కలు కొట్టించేది. మళ్లీ జీడి తీసి తుడిచి పెట్టేవాళ్ళం. ఉప్పు, కారం కొద్దిగా అరచేతిలో కలుపుకుని ముక్క రుచి చూసేవాళ్లం. పళ్లు పులిసే పులుపు 'అబ్బో బోలెడంత ఉప్పుకారం పడుతుంది ఈసారి' అనుకునేది ప్రతీసారీ.

పెద్ద వంట బాండీలు అటక మీద నుంచి దింపించి వాటిల్లో ఉప్పు, కారం, ఆవపిండి, సెనగలు, ఇంగువ నూరి కలిపి, చివరిగా నువ్వుల నూనె పోసేది. ముక్కల్ని కొద్ది కొద్దిగా కారం నూనెలో వేస్తూ నాలుగువైపులా కలిపేది. ఆ పచ్చడిని గోడవారగా చేర్చి పెద్దమూతలు పెట్టి మూడు రోజులు ఊరబెట్టేది. నాలుగోనాడు తిరగగలిపి రుచి చూడమని అన్నంలో వడ్డించేది. ఉప్పు చాలిందో లేదో జాగర్తగా చూసి చెప్పండి, చాలకపోతే పచ్చడంతా బాజుపడుతుంది అని హెచ్చరించేది నన్నూ, తాతయ్యని.



జాగ్రత్తగా జాడీలను ఎత్తిపెట్టి 'ఈ ఏడాది గడిచింది' అని తృప్తిగా నిట్టూర్చేది.

గంగాయి కుటుంబానికి కావలసిన ఆవకాయ తీసి ఇచ్చేది. వాడి ముఖం, వాడి పిల్లల ముఖాలు సంతోషంతో వెలిగిపోయేవి. తరువాత ఇరుగూ పొరుగూ వాళ్లకు పంపేది. విచిత్రమేమంటే అమ్మమ్మకు ఎవరూ ఆవకాయ తెచ్చిచ్చేవాళ్లు కాదు.

"ఆ నీకేం నచ్చుతుంది లేవమ్మా మా ఇంటి ఆవకాయ, నీ అంత రుచిగా ఊళ్లోనే కాదు దేశంలోనే ఎవరూ పెట్టలేరు" అనేవాళ్లు అందరూ. "నిజమే" అనేవాడు తాతయ్య గర్వంగా.

మామయ్యలకు అమెరికా పంపటానికీ, పిన్నికి జయపూరు పంపటానికీ, మాకూ జాడీలు తీసిపెట్టేది. ఆ జాడీలను నాతో హైదరాబాదు తెచ్చేవాణ్ణి. ఏవో తిప్పలు పడి అమ్మానాన్నా వాటిని గమ్యం చేర్చేవాళ్లు. ప్రతీసారి అన్నం తిన్న తరువాత ఆవకాయ ముక్కను కడిగి కొరుక్కుంటూ ఇల్లంతా తిరిగేవాణ్ణి. అమ్మమ్మ దగ్గరికి వెళ్తే బోరు కొడుతుంది అనే మాటే ఉండేది కాదు.

ఏవో గేమ్స్, కామిక్‌లూ నాతో తీసుకువెళ్లినా అవి పెట్టెలోంచి బయటికి తీసే అవసరం ఎప్పుడూ రాలేదు.

ప్రతీవారం ఆముదంతో తలంటేది. గంగాయి ఒళ్లంతా నూనె పట్టించేవాడు. "ఎండలో బాగా నాననీ" అనేది అమ్మమ్మ. జిడ్డు వదిలేదాకా నలుగు పెట్టి నల్చేవాడు. కుంకుడురసం పెట్టి తలరుద్దేది. గాడిపొయ్యిపై కాగులో కాచిన వేడి వేడి నీళ్లు నాలుగైదు బక్కెట్లు పోసేది.

ఎందుకో గానీ తలంటి స్నానం పూర్తవగానే నిద్ర

## దేని దారి దానిదే!

**ఐపిఎల్ టీమ్స్‌లో పంజాబ్‌కి ఓనర్ అయిన ప్రీతి జింతా చెన్నయ్ టీమ్ కెప్టెన్ అయిన ధోనితో కలిసి ఓ యాడ్ చేయడం అంతటా చర్చనీయాంశంగా తయారైంది. మైదానంలో రెండు టీములూ గెలుపు కోసం హోరా హోరీ పోరాటం సాగిస్తాయి. అలాంటి నేపథ్యంలో ఇద్దరు ప్రత్యర్థులూ కలిసి ఓ యాడ్ చేయడం ఆసక్తికరంగా వుంటుంది. ఇమామి కంపెనీకి సంబంధించిన ఈ యాడ్‌లో కూడా వైరివర్గాల్లాగానే చిత్రీకరణ వుంటుందిట. కాకపోతే కాస్త హాస్యంగా వుంటుంది- అని నవ్వుతోంది సొట్టబుగ్గల సుందరి ప్రీతి.**

ముంచుకొచ్చేది. అలా ఉండగా...ఒక రోజు నేను స్కూలు నుంచి ఇంటికి వచ్చేసరికి చుట్టాలతో ఇల్లంతా హడావుడిగా వుంది. అమ్మ ఏడుస్తోంది.

అమ్మమ్మ చచ్చిపోయిందిట.

ఏ జబ్బా, జ్వరమూ లేకుండా ఉన్నపళంగా ప్రాణం పోయిందిట. "ఏడవకమ్మా, ఆమెకేం మహారాజు, ఎవరితోనూ చేయించుకోకుండా మంచం పట్టి రొష్టు పడకుండా తిని తిరుగుతూ పువ్వులా రాలిపోయింది" అని అమ్మను అంతా ఓదారుస్తున్నారు.

అమ్మమ్మ చచ్చిపోవటమేమిటి రబ్బిష్... అనుకున్నాను. పూర్తిగా నమ్మలేదు కూడా.

ఆ రాత్రి అమ్మమ్మ వాళ్ల ఊరు చేరాము. మామయ్యలకు కబురు అందినా వాళ్లు అప్పటికప్పుడు రాలేకపోయారు. రెండు మూడు రోజులు పట్టవచ్చు అన్నారు. పిన్ని కుటుంబం, చుట్టాలు వచ్చారు. అప్పటికే ఊరంతా ఆ ఇంట్లో వుంది.

తాతయ్య ముందు వసారాలో గుంజకు ఆనుకుని చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు. ఎవరికీ తాతయ్యను పలకరించే ధైర్యం లేకపోయింది. 'అయ్యో, ఈ వయసులో ఈ కష్టం ఎట్లా ఓర్చుకుంటాడు?' అని అమ్మా, పిన్నీ తండ్రిని చూసి విలవిలలాడారు. అమ్మమ్మ మీద వాలిపోయి ఇద్దరూ ఒకటే ఏడుపు. అమ్మమ్మకి ముఖమంతా పసుపు రాసారు. పెద్ద కుంకం బొట్టు పెట్టి కొత్తచీర తీసి కప్పారు.

గంగాయి కుటుంబం శోకాలు పెట్టి ఎలుగెత్తి ఏడుస్తున్నారు. అక్కడ ఏడవని వాళ్లు లేరు. నేను తాతయ్య తప్ప!

"ఈ బిడ్డంటే ప్రాణం. ఏటేటా వస్తాడాయె. ఏదో చేసిపెడదామని ముసిలామెకి తాపత్రయం" నన్ను చూపించి చెప్పుకున్నారంతా.

నా బిక్కముఖం చూసి "ఎన్నడూ చావు చూసి ఎరగడు పాపం" అనుకుని బాధపడ్డారు అమ్మానాన్నా.

బ్రాహ్మలు వచ్చి మంత్రాలేవో చదువుతున్నారు. తాతయ్యను రమ్మన్నారు. స్నానం చేసిన తడిబట్టలతో వచ్చి కూర్చుని వాళ్లు చెప్పినట్టు చేస్తున్నాడు. తాతయ్య ఎవరి వంకా చూడడంలేదు. అమ్మమ్మ కసిరినప్పుడు అలిగినట్టుంది ఆయన ముఖం.

నా కళ్లకు మొదటిసారిగా 'ముసలితనం' కనిపించింది ఆయనలో.

అమ్మమ్మ చుట్టూ తిరిగి నమస్కారాలు చేస్తున్నారంతా. చివర్న ఆమె నోటి దగ్గర బియ్యపు గింజలు వేస్తున్నారు. నా చేతకూడా వేయించారు. అమ్మమ్మ అలా కదలకుండా అంతసేపు పడుకుని వుండడం ఎన్నడూ చూడలేదు. ఎప్పుడూ ఏవో పనులు చేస్తూ, పురమాయిస్తూ తిరిగేది.. ఇదేనా చావంటే?

అమ్మమ్మకు బియ్యం పెట్టినప్పుడు మాత్రం చెట్టు విరిగినట్టు కూలిపోయాడు తాతయ్య. పెద్దపెట్టున ఏడ్చి "నీ రుణం ఇవాల్టితో తీరిపోయిందా" అని తలబాదుకున్నాడు. చూడలేకపోయాను.

పరిగెత్తి వెళ్లి తాతయ్యను చుట్టుకున్నాను. నాకూ ఏడుపు లోపల్నుంచి తన్నుకొచ్చింది. వెక్కిళ్లు పెట్టి ఏడుస్తున్న నన్ను నాన్న లోపలికి తీసుకువెళ్లారు.

ఊరంతా తనకోసం ఏడుస్తోంటే అమ్మమ్మ ఎప్పటికీ కనిపించకుండా వెళ్లిపోయింది.

ఆ డిసెంబరు నెల చాలా నెమ్మదిగా నత్తనడక నడుస్తూ గడిచింది. మార్చిలో పరీక్షలు కాగానే ప్రతిసారిలా అమ్మమ్మ వాళ్ల ఊరు ప్రోగ్రాం వేశాను. "నీ మొహం ఏముందక్కడ? అసలే పెద్దాయన ఒక్కడూ ఇబ్బంది పడుతూంటే" అని విసుక్కున్నాడు నాన్న.

"ఏం చేద్దాం.. మొదటినుంచీ ఇద్దరికీ మొండి పట్టుదల.. అక్కడే వుండి, అక్కడే రాలిపోవాలని" కళ్లు తుడుచుకుంటూ అన్నది అమ్మ.

"ఆయన వస్తే ఎవరు కాదంటారు? అందరమూ అడిగాము. కాళ్లావేళ్లా పడ్డాము. ఉహూ..వింటేనా?" కాస్త కోపంగా అన్నాడు నాన్న.

"ఆవిడను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో వున్నాడు. వున్నపళంగా అందరూ రమ్మంటే మాత్రం ఇష్టపడొద్దూ? ఆ ఇల్లు వదిలి ఎక్కడా వున్న అలవాటే లేదాయె" బాధగా అనుకున్నది అమ్మ.

అలా నన్ను పంపకుండా ఒక నెల గడిచింది. ఇంతలో గంగాయిని వెంటబెట్టుకుని ఊరి పెద్ద మనిషి వచ్చాడు మా ఇంటికి. తాతయ్య పంపించాడు. నన్ను వెంటబెట్టుకుని రమ్మని. ఇంక నన్ను పంపక తప్పింది కాదు. ఎగిరి గంతేసి బట్టలు సర్దుకుని బయలుదేరాను.

అమ్మమ్మ లేని లోటు స్పష్టంగా కనిపించింది. నాకు ఎంతో ఇష్టమైన ఆ ఇంటినీ, పెరడంతా తిరిగి తిరిగి చూశాను. అమ్మమ్మ నాకు కనపడకుండా ఎక్కడో ఇంకా తిరుగుతూందనే అనిపించింది కానీ చచ్చిపోయింది ఇంక రాదు అనుకో



## మరీ ఇంత బడాయా?

**ప్రియాంకా చోప్రాకి ఇటీవల కాలంలో దాదాపు అన్ని సినిమాలకూ మనీష్ మల్హోత్రాయే స్టయిలింగ్ చేస్తున్నాడు. తాజాగా 'అంజానా అంజానీ' అనే సినిమా షూటింగ్ అమెరికాలో జరుగుతున్నప్పుడు తన డ్రెస్ బొత్తిగా తనకి నచ్చలేదని ప్రియాంక చెప్పడంతో అక్కడే వున్న మనీష్ అసిస్టెంట్ దాన్ని కరెక్ట్ చేయబోయిందిట. కానీ ప్రియాంక మాత్రం మనీష్ స్వయంగా చేస్తేనే ఒప్పుకుంటానందిట. ప్రతిసారీ మనీష్ అందుబాటులో వుండాలంటే ఎలా? పైగా ఇప్పుడు అర్జెంట్‌గా యు.ఎస్.కి అతన్ని ఎలా తెప్పించాలి మేం? అని నిర్మాతలు తలలు పట్టుక్కూర్చుని ఆనక బ్రతిమిలాడి మేడమ్‌గార్ని ఎలాగోలా ప్రసన్నం చేసుకున్నారట.**

వటం చాతకావట్లేదు. ఎందుకో మరి! తాతయ్య నన్ను చూసి చాలా ఆనందపడ్డాడు. అమ్మమ్మ చేసినంత బాగా కాదు కానీ వంటా అదీ తాతయ్యే చేస్తున్నాడు.

"రారా శేషూ అన్నానికి" అని పిలిచి వంటింట్లో చిన్న పీట వాల్చాడు. అన్నం, కూరా వడ్డించాడు.

రుచి ఫర్వాలేదు.

"కలపనా?" అనడిగితే వద్దులే అన్నాను. అమ్మమ్మ నా దగ్గర కూచుని విసురుతూ మధ్య మధ్య అనుపానాలు కలిపి తినమనటం గుర్తొచ్చింది తిన్నంతసేపూ. అమ్మమ్మ కబుర్లు చెప్తే తాతయ్యను ఏడిపించటం అవుతుందని పించి సాధ్యమైనంత వరకు వేరే కబుర్లు చెప్పాను.

తాతయ్య మామూలుగానే కనిపించాడు. నవ్వుతూ ఏవేవో విషయాలు మాట్లాడాడు. పాత తాతయ్యలాగే వున్నాడు.

మధ్యాహ్నం పొలం దగ్గర ఏవో పనులుండి గంగాయితో వెళ్లాడు. పెరట్లో మామిడి చెట్టుకింద చప్టామీద చాప వేసింది గంగాయి భార్య. పైకి చూస్తూ వెల్లకిలా పడుకున్నాను. చెట్టునీడ హాయిగా వుంది. ఎండ తగిలీ తగలకుండా మెల్లగా గాలి వీస్తోంది.

గుత్తులు గుత్తులుగా మామిడికాయలు విరగకాసి ఉన్నాయి. 'ఎన్ని కాయలో? ఇంకెవరు కోస్తారు? ఆవకాయ పెట్టేవాళ్లే లేరుగా' అనుకున్నాను.

అబ్బ! ఆవకాయ పెట్టేటప్పుడు ఎంత హడావుడి చేసేది అమ్మమ్మ. ఇంకెప్పుడూ ఆవకాయ పెట్టం కదా! ఎవరు నా చేత ముక్కలు తుడిపించి, జీడి తీయిస్తారు? అంత రుచిగల ఆవకాయ ఎవరు కలుపుతారు?

అమ్మమ్మ ఎక్కడికి వెళ్లింది? తాతయ్యనూ, ఇంటినీ వదలి ఎలా వెళ్లగలిగింది? ఈ ఇల్లు వదలి ఎవరి దగ్గరికీ రాని మనిషి అలా నిద్రపోయినంత తేలికగా ఎటు మాయమైపోయింది? జరిగినదంతా గుర్తొచ్చి కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి.

"యెబ్బే! ఏడుస్తారా ఎవరైనా?" అన్నట్టు వినిపించింది. అమ్మమ్మ గొంతే అది. కన్నీళ్లు తుడుచుకుని చుట్టూ చూస్తే గంగాయి పిల్లలు చెట్లెక్కి ఆడుతున్నారు. నేను కూడా గబగబా చెట్టుపైకి ఎగబాకాను. పైకి..పైపైకి ఎక్కాను దట్టంగా వున్న మామిడికొమ్మల నిండా కాయలు వేలాడుతున్నాయి.

"ఒరే నువ్వు కిందికి దిగరా. నేను కాయలు కోసి పడేస్తా, పట్టుకో" అన్నాను గంగాయి కొడుకుతో. చాలా కాయలు కోసి కిందికి పడేస్తే వాడు నవ్వుతూ పట్టుకున్నాడు.

"శేషూ" అని పిలుస్తూ తాతయ్య గొంతు వినిపించింది. "ఇక్కడ ఇక్కడ" అని అరిచాను చెట్టుపైనుంచి.



"అరె భడవా అంత పైకెట్టా ఎక్కావురా" అన్నాడు తాతయ్య ఆశ్చర్యంగా పైకి చూస్తూ. "దిగిరా, జాగ్రత్త చేతులూ కాళ్లూ దోక్కోకుండా చూసుకు దిగు" అన్నాడు.

దిగి వచ్చి "తాతయ్యా చూడు.. ఎన్ని కాయలు కోశానో" అన్నాను. ఒక్క క్షణం ఏమని మాట్లాడాలో అర్థంకానట్టు ఉండిపోయాడు తాతయ్య.

"భలే...మంచి కాయలు ఏరి కోశావే. రా, లోపలికి పోదాం" అంటూ నన్ను తీసుకుని లోపలికి నడిచాడు. గంగాయి పిల్లలు కాయల్ని కుప్పగా రాతి తొట్టి దగ్గర పోశారు.

"తాతయ్యా, మరీ ఇందాక నేను మామిడి చెట్టుకింద కూచుంటే అమ్మమ్మ బాగా జ్ఞాపకం వచ్చి ఏడుపొచ్చింది. అంతలో..." అంటుండగానే "మీ అమ్మమ్మ గొంతు వినిపించిందా?" అన్నాడు తాతయ్య నవ్వుతూ.

"అరె నీకెట్లా తెలుసు?" అన్నాను ఆశ్చర్యపోయి.

గట్టిగా నవ్వాడు తాతయ్య. "అమ్మమ్మ ఇక్కడే వుందిరా. ఎక్కడికీ పోలేదు. రోజంతా నా మీద ఒక కన్నేసి ఉంచుతుంది. నేను లేచానో లేవలేదో, తిన్నానో లేదో అన్నీ ఒక కంట కనిపెడుతుంది"

"మరి నువ్వు చుట్ట కాల్చేటప్పుడు ఆడిపోసుకుంటుందా?" అనడిగాను.

చిన్న మొట్టికాయ వేశాడు తాతయ్య.

"నన్ను ఆడిపోసుకోకపోతే దానికి రోజు గడుస్తుందిట్రా?" అన్నాడు నిట్టూర్చి.

తాతయ్య చుట్టలు కాల్చటం బాగా తగ్గించాడు. అలవాటుగా రోజూ కాల్చటం లేదు. నేనున్న రెండు నెలల్లో ఒక నాలుగైదు సార్లు కాల్చాడేమో.

"తాతయ్యా మనం ఏడుస్తూ కూచుంటే అమ్మమ్మకు నచ్చదు కదా" అన్నాను అమ్మమ్మ పద్ధతులు గుర్తు చేసుకుంటూ . అమ్మమ్మ చాలా ప్రాక్టికల్ మనిషి. పల్లెటూ

## మాతృభాషలో విద్య

**హిం**దీ చిత్రాల్లో రాణిస్తున్న విద్యాబాలన్ స్వతహాగా కేరళకుట్టి. అయితే ఆమె ఇప్పటి దాకా ఏ మలయాళ సినిమాలోనూ నటించలేదు. ఆ మాటకొస్తే ఏ దక్షిణాది భాషలోనూ నటించకుండానే డైరెక్ట్‌గా హిందీలోకి అడుగుపెట్టింది. తాజా సమాచారం ప్రకారం త్వరలోనే విద్యాబాలన్ తన మాతృభాష మలయాళంలో నటించడానికి రెడీ అవుతోంది. మమ్ముట్టి హీరోగా నటించే ఓ మలయాళ చిత్రంలో హీరోయిన్‌గా నటించడానికి విద్యాబాలన్ ఒప్పుకుందిట. ఇటీవల విద్య నటించిన 'ఇష్కియా' సినిమా ఆమెకి నటిగా మరింత పేరు తీసుకొచ్చింది.

రులో ఉంటూ కూడా ఆ వయసు పెద్దవారిలో ఉండే భావకాఠిన్యం, చాదస్తాలు ఆమెలో చాలా తక్కువనే చెప్పాలి.

"ఛ..ఛ..ఎందుకురా ఏడుస్తూ కూచోవటం? ఎందుకంట? లక్షణంగా తాను తింటూ, నలుగురికీ చేసిపెడుతూ మంచం పట్టకుండా తిరుగుతూ తిరుగుతూ వెళ్లిపోయింది. మహారాజు"

కండువా దణ్ణెం మీద వేస్తూ అన్నాడు.

"ఏమో తాతయ్యా, చెట్టునిండా మామిడికాయలు చూసి అవకాయ పెట్టుకోవటం ఇంక లేదేమో అనిపించింది. ఇంట్లో కూడా, మునుపటిలా.. అమ్మమ్మ ఉన్నప్పటిలా లేదు" మళ్లీ కన్నీళ్లొచ్చాయి నాకు.

తాతయ్య ఏమీ అనలేదు. మంచం వాల్చుకుని కూర్చున్నాడు. వాన వెలిసిన ఆకాశంలా విప్పారి వుంది ఆయన ముఖం. రెండు నెలల క్రితం చావు జరిగినప్పుడు చూసిన తాతయ్యలా లేదు. అమ్మమ్మ ఉన్నప్పటి తాతయ్యలాగే హాయిగా ఉన్నాడు.

నా చేతిని తన చేతిలోకి తీసుకుని దగ్గరగా కూర్చోబెట్టుకున్నాడు.

"ఎలా ఉంటుందిరా శేషుడూ...ఎప్పటికీ మనకు మునుపటిలా ఉండదు. అడుగడుక్కీ జ్ఞాపకాలు వదలిపెట్టి పోయిందాయె. ఏం చేస్తాం? తప్పనిసరి ప్రయాణం. చూడు...మనిద్దరం ఇలా బాధపడడం మళ్లీ జరగకూడదు. ఇలా బాధపడాలనీ, ఏడుస్తూ కూచోవాలనీ కాదు మీ అమ్మమ్మ వెళ్లిపోయింది...తను లేకపోయినా మనం మామూలుగా బతకగలగటం అలవాటు చేసుకోవాలని..." అన్నాడు తాతయ్య.

"పద, మీ అమ్మమ్మ బాలశిక్ష తీసుకొచ్చి కాసేపు కాలక్షేపం చేద్దాం" నాకు తోచటం లేదనీ, అందుకే అమ్మమ్మను మాటిమాటికీ తల్చుకుంటున్నానని అనుకుని లేచాడు.

మండువాలో ఒక ప్రక్కగా కావిడిపెట్టె వున్నది. దాంట్లో ఏవేవో వస్తువులు, ఒక అద్దాలు కుట్టిన బట్ట సంచీ తీశాడు. దాంట్లో అమ్మమ్మకూ, తాతయ్యకూ పిన్నీ మామయ్యలు, అమ్మా రాసిన ఎన్నో ఉత్తరాలు, ఫోటోలు ఉన్నాయి. న్యూస్‌పేపరుతో అట్టలేసిన పెద్దబాలశిక్ష తీసాడు.

అపురూపమైన ఆ పుస్తకాన్నీ, సంచీనీ తీసుకుని బయటికి వచ్చాం. మామయ్యలు తమ తల్లిదండ్రుల్ని రమ్మని పోరుతూ రాసిన ఉత్తరాలు, పిన్ని, అమ్మ పండుగలకు రమ్మని రాసిన కార్డులూ, మా చిన్నతనాలవి బోలెదన్ని ఫోటోలు... ఆవకాయ, వంటలూ ఎలా చెయ్యాలో తెలియబరచమని కోడళ్లు రాసిన ఉత్తరాలు... ఇలా ఎన్నెన్నో...

బాలశిక్ష తిరగేశాం. తెలిసినవే మళ్లీ మళ్లీ ఇద్దరం గట్టిగా చదివి నవ్వుకున్నాం. అప్పుడు కనిపించింది...పుస్తకం ఆఖర్న న్యూస్‌పేపర్ మడత దగ్గర జాగ్రత్తగా మడిచి పెట్టిన రూళ్లకాయితం.

"ఇదేమిట్రోయ్?" అంటూ ఆశ్చర్యంగా దాని మడత విప్పాడు తాతయ్య.

'ఆవకాయ పాళ్లు' అని గొలుసుకట్టు రాతలో రాసివుంది హెడ్డింగు.

ఆవపిండి, ఉప్పు వంటి దినుసులు, ఎన్ని కాయలకు ఎంత కొలత వెయ్యాలో లెక్కరాసి వుంది. పచ్చడి కలిపే విధానం, ఊరిన తర్వాత తిరగతిప్పే విధానం వుంది. అయితే కిలో గ్రాముల లెక్కన కాకుండా, సోలెడు, గిద్దెడు, మానెడు వంటి యూనిట్లు రాసివున్నాయి.

కాగితం చివర్న అమ్మమ్మ బ్రాండ్ ప్రాక్టికాలిటీ కనిపించింది.

పచ్చడి కొలతలు పిల్లలకు అర్థం కావని తెలుసేమో..."మన పెద్ద స్టీలు గ్లాసుతో రెండు.. గిద్దెడంటే మనం పప్పు కొలుచుకునే బోడిగిన్నెతో..." ఇలా వివరణలు ఇచ్చింది.

"ఎప్పుడో తన పిల్లల కోసం రాసిన బాపతు కాయితం లాగుంది" అన్నాడు. మా ఇద్దరిలో ఏదో ఎగ్జయిట్‌మెంట్. ఏదో సంతోషం... "పదరా అబ్బీ.. లేలే" అన్నాడు తను ఒక్క ఉదుటున లేచి.

"ఎక్కడికి తాతయ్యా?"

"హారి పిచ్చోధవా... ఇంకా అర్థం కాలేదుట్రా? ఈ కాయితం ఏమిటనుకున్నావ్? మీ అమ్మమ్మ ఆవకాయ పెట్టమని ఆర్డరు వేసింది. ఇందాక నీ చేత కాయలు కోయించింది. ఇప్పుడు ఈ కాయితం మనిద్దరి చేతికీ ఇచ్చింది ఎట్లా పచ్చడి కలపాలో తెలుసుకొమ్మని"

నిజమేననిపించింది. అమ్మమ్మ ఆవకాయ ఇక తినే అవకాశం లేదనుకున్నాను. ఇప్పుడు ఇలా జరగటం వింతగా, అద్భుతంగా అనిపించింది.

## పాపం అమీషా!

***సి**నిమా కెరీర్ కోసం తనను మనువాడతానన్న మనిషిని దూరం చేసుకుందిట అమీషా పటేల్. అమీషాకి దాదాపు మూడేళ్లుగా 'ఫ్రెండ్'గా వుంటున్న కనవ్ పురి అనే ఓ ఎన్నారై అమీషా నిర్ణయంతో విస్తుపోయి తిరిగెళ్లిపోయాట్ట. గత ఏడాది జూన్‌లో పెళ్లి ప్రపోజల్‌ని అతడే తీసుకొచ్చాట్ట. కానీ అమీషా వాయిదా వేస్తూ వచ్చిందిట. తన కెరీర్‌లో అభివృద్ధికి మరొక్క అవకాశం కోసం పెళ్లి అప్పుడే వద్దనేసరికి పాపం కనవ్ కంగుతిన్నాట్ట. ఇప్పుడు సినిమాలూ లేవు. మనువాడతానన్న వాడు దూరమయ్యాడు. కాకపోతే ఇంత కాలంగా తల్లిదండ్రులకు దూరంగా వుంటున్న అమీషా వాళ్లకి దగ్గరైందిట ఇప్పుడు.*



అనుకోవటమే ఆలస్యం...చకచకా పనులు ఊపందుకున్నాయి. గంగాయి పిల్లలు కాయల్ని కడిగి తెచ్చారు. నేనూ వాళ్లూ శుభ్రంగా కాయల్ని తుడిస్తే తాతయ్య, గంగాయి అటకమీద నుంచి భాండీలు దింపి చకచకా ముక్కల్ని ఆరుపచ్చాలుగా కొట్టాడు. జీళ్ల తీసి తుడిచిపెట్టుకున్నాం.

తాతయ్య లెక్క చూసుకుంటూ దినుసులు కలిపాడు.

పెద్ద మూతలు పెట్టి గోడవారగా భాండీలను నెట్టాము.

అప్పటికే చీకట్లు ముసురుకుంటున్నాయి. గంగాయి భార్య సంజెకనువు చిమ్మి గూట్లో దీపం పెట్టింది.

తాతయ్య స్నానం చేసి వచ్చి తులసికోటలో దీపం పెట్టాడు. కుంపటి మీద అన్నం వండి, చారు పడేశాడు. నేనూ స్నానం చేశాను.

కారం నూనె తగిలిన అరచెయ్యి భగ్గున మండుతూంటే ఊదుకుంటూ కూర్చున్నాను.

కొబ్బరినూనె తెచ్చి అరచేతికి మర్దించాడు తాతయ్య 'తగ్గిపోతుందిలే' అంటూ. నిజంగానే పావుగంటలో తగ్గిపోయింది.

"మొత్తానికి ఈ ఏడాది అలవాటు తప్పకుండా ఆవకాయ పెట్టించిందిరా మీ అమ్మమ్మ" అన్నాడు తాతయ్య సంతోషంగా.

తరువాత రెండేళ్లకి తాతయ్య కూడా 'తప్పనిసరి ప్రయాణం' చెయ్యవలసి వచ్చింది. అంతటితో అమ్మమ్మ ఊరు నా కళ్లకు దూరమైనా మనసులో శాశ్వతంగా సజీవమైన జ్ఞాపకంగా నిలిచిపోయింది.

* * *

శేషు శేషగిరిరావయ్యాడు.

ఒక్కోసారి వెనుదిరిగి చూసుకుంటే అమ్మమ్మ గారింట్లో గడిపిన వేసంకాలం సెలవులన్నీ వెరసి నా బాల్యంగా నా స్మృతిపథంలో నిలిచిపోయాయి. అమ్మమ్మ-తాతయ్యల విలక్షణ వ్యక్తిత్వాలూ, నామోషీ ఎరుగని కాయకష్టం, పిల్లలను, సహజ స్వార్థపూరితమైన మమకారంతో ఇంటికి కట్టివేసి వారి అభివృద్ధి నిరోధించకుండా అందరినీ చదువులకనీ పైచదువులకనీ ప్రపంచంలోకి వదిలి వారి జీవితాన్ని, వారు వెదుక్కునే స్వేచ్ఛను ప్రసాదించటం, భేషజాలకు పోకుండా సామాన్య జీవితాన్ని సంతృప్తితో గడపటం, ముఖ్యంగా అమ్మమ్మ ప్రాక్టికాలిటీ... ఎవరికీ అడ్డం కాకుండా, అడ్డం రాకుండా, తనదైన వ్యక్తిత్వంతో తన పరిధిలోనే ఒక ఉనికిని ఏర్పరచుకోవటం... ఇలాంటివన్నీ నా పిల్లలతో నేను వ్యవహరించే తీరుపైనే గాక, నా దైనందిన జీవితంపైన కూడా తమ ప్రభావాన్ని చూపించాయి. ఈ నా వైఖరిని నా తల్లిదండ్రులు 'శేషుడికన్నీ అమ్మమ్మ-తాతయ్యల పోలికలే' అని అనువదించుకుంటారు.

ఇంతెందుకు? చిన్న చిన్న విషయాల ప్రసక్తి వస్తే నా పిల్లలు అన్ని కాయగూరలూ ఇష్టంగా తింటారు. కాకరకాయ కూడా. ఆకుకూరల పేర్లు, రకాలు, వాటి పోషకవిలువలు వాళ్లకి తెలుసు. మా ఇంట్లో కూడా ఆవకాయ పెట్టటం ఏటా ఒక తతంగం. సీజను వచ్చిందంటే నేనూ, పిల్లలూ, నా భార్యా కూచుని ఆవకాయ కలుపుతాం.

అమ్మమ్మ 'రెసిపీ' కాగితం అతి జాగ్రత్తగా, బీరువాలోంచి తీసి చేత్తో పట్టుకుని 'పాళ్లు' చదివి ఆవకాయ కలపటం ఒక మాటలకందని అనుభూతి.


పాతబడిన కాయితం, గొలుసుకట్టు దస్తూరీ, రెండు తరాల క్రితం తాతమ్మ రాసిన పాళ్లు చదువుతూ మూడో తరం సంతతి ఆవకాయ పెట్టుకోవటం దేశంలో అరుదేమీ కాదేమో కానీ, నా ఇంట్లో అపురూపం! ఈనాటికీ మేము తినే భోజనంలో ఆనాటి మాతృమూర్తి వాత్సల్యం వ్యక్తమవటాన్ని ఏ పేరుతో పిలవగలను?

కాలగతిలో ఎన్ని మార్పులొచ్చినా, మనిషిని నేల మీద స్థిరంగా నిలబెట్టి నడిపించే విలువలు మాత్రం మారవనే సత్యం నా వయసుతోబాటు గ్రహింపుకొచ్చింది. బహుశా అవే విలువల్ని నా నుంచి నా పిల్లలు నేర్చుకోవాలని తండ్రిగా ఆశిస్తున్నాననుకుంటా.

ఇవాళ ఆదివారం. అరుగో పిల్లలొస్తున్నారు, పెద్దబాలశిక్ష పుచ్చుకుని. అమ్మమ్మ మూడో తరానికి కూడా మౌలికమైన లోకజ్ఞానాన్ని అందించటానికి నన్నొక పరికరాన్ని చేసింది... ఇంక చెప్పటానికేముంది?

చరిత్ర పునరావృతమౌతోంది.

○



# ఐశ్వర్య డిమాండ్

కరీనాకపూర్‌కి ఓ సినిమాకి 7 కోట్ల వరకూ ఇవ్వడానికి నిర్మాతలు సిద్ధమవుతుంటే మాజీ మిస్ వరల్డ్ ఐశ్వర్యారాయ్‌కి మాత్రం ఏం తక్కువ పది కోట్లయినా ఇవ్వచ్చు అంటున్నారు. అనడమేంటి- బాబ పుష్కర్ణా అనే ఓ నిర్మాత 10 కోట్లకి ఆమెతో ఓ సినిమా చేయడానికి రెడీ అయిపోయాట్ట కూడా. కొన్నేళ్లుగా ఐశ్వర్యతో సినిమా తీయాలని తెగ ఉబలాటపడుతున్న ఆ నిర్మాత ఎట్టకేలకు ఐష్‌గారి అంగీకారాన్ని సాధించగలిగాట్ట. ఈ భారీ పారితోషికం ఈ ఒక్క సినిమాకేనా లేక ఇకపై ప్రతి సినిమాకీ కంటిన్యూ అవుతుందా? అని సినీజనాలు చర్చిస్తున్నారు.